

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

12-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 224 పేజీలు: 12 వెల: 6.50


తిరుమల కొండంతా భక్తజనం 3లో

ప'వర్రీ' కాకూడదు

# దౌత్యమే సరైన దారి

ఉక్రయిన్‌తో యుద్ధాన్ని విరమించండి

వివాదాల పరిష్కారంలో తోడుంటాం

2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీలో ప్రధాని మోడీ

మాస్కోకు రావాలని మోడీకి పుతిన్ ఆహ్వానం




శుక్రవారం న్యూఢిల్లీలో బ్రిక్స్ దేశాధినేతలతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:** రష్యా-ఉక్రెయిన్ మధ్య కొన సాగుతున్న యుద్ధ ప్రభావం సముద్ర వాణిజ్యంపై పడుతున్న తీరును, భారత నావికుల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీరష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దృష్టికి తీసుకెళ్లారు. వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ముందుకు వెళ్లే మార్గమని మోడీ మరోసారి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా శుక్రవారం మోడీ, పుతిన్ 45 నిమిషాలకు పైగా ద్వైపాక్షిక సమావేశం నిర్వహిం చారు. భారత్-రష్యా సంబంధాలపై సమీక్ష జరి పిన ఇరువురు నేతలు కీలక ప్రాంతీయ, అం తర్జాతీయ పరిణామాలపై చర్చించారు. పశ్చిమా సియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో కొనసా గుతున్న ఘర్షణల కారణంగా సముద్ర వాణిజ్యం, భారత నావికుల భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై ఇరు వురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారని భారత విదేశాంగ శాఖ వెల్లడిం చింది. వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ముందుకు వెళ్లే మార్గమని మోడీ పునరుద్ఘాటిం చారని, శాంతి ప్రయత్నాలకు సహక రించేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపింది. రష్యా-ఉక్రె యిన్ ఘర్షణల నేప థ్యంలో నల్ల సముద్రంలో ఇప్పటివరకు ఐదుగురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ అంశాన్ని భారత్ మాస్కో, కీవ్‌లతో చర్చించింది. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల మధ్య రష్యాతో ఆర్థిక సం బంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ ప్రయత్ని స్తోంది. ప్రస్తుతం సుమారు 65 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాల ర్లకు పెంచాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకు న్నాయి. ఎకనామిక్ కోఆపరేషన్ ప్రోగ్రామ్-2030అమలుతో పాటు వాణిజ్య సంబం >>2

## బ్రిక్స్ 21 దేశాల వాణిజ్యం గ్లోబల్ ట్రేడ్‌లో 25%

### గ్లోబల్ వాణిజ్య అడ్డంకులున్నా ఆగని అభివృద్ధి

### బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 11:** ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతున్న సమయంలో భారత్ మాత్రం అడ్డంకులు అధిగమించడంపై దృష్టి సారి స్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీఅన్నారు. బ్రిక్స్ దేశాల ఆర్థిక శక్తి, ప్రపంచ ప్రాధాన్యత వేగంగా పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బ్రిక్స్ బిజినెస్ ఫోరం లీడర్స్ సెషన్‌లో శుక్రవారం ప్రసంగించిన ప్రధాని మోడీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్య తను వివరించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు >>2

# పెన్షన్లు, సంక్షేమం కోసం విడిపోవద్దు 3లో

పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా సంక్షేమం... ఇదే కూటమి ప్రభుత్వ విధానం

కొత్త పెన్షన్లకు ముందే ఫ్యామిలీ యూనిట్ మ్యాపింగ్ పూర్తవ్వాలి

అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేయండి

యానాటి కొండ సామాజికవర్గానికి ఎస్టీలకు కలిగే ప్రయోజనాలు

సూపర్ సిక్స్ పథకాల అమలుపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు




2లో

## ఫైళ్లు పెండింగ్ పెట్టొద్దు!

ఇక ఆన్‌లైన్‌లోనే అన్ని దస్త్రాల నిర్వహణ

సమావేశానికి గైర్హాజరైన అధికారులపై సిఎం ఆగ్రహం

## జీరో డ్రగ్స్, జీరో టాలరెన్స్ లక్ష్యంగా త్రిశూల్ కమిటీ

### సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు, కంటెంట్‌లపై కఠిన చర్యలు

శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటూనే ప్రజాహితంగా పోలీసులు మెలగాలి

సమాజంలో ఉండే సమస్యలకు అనుగుణంగా పోలీసు విభాగం స్పందించాలి

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఎస్పీ, పోలీస్ అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

రాజకీయ ముసుగులో అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక

**విజయవాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** జీరో డ్రగ్స్, జీరో టాలరెన్స్ ఆన్ ఉమెన్, జీరో రోడ్ యాక్సిడెంట్స్ లక్ష్యంగా కమిటీ వేసి ఓ కార్యాచరణను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగింది. శుక్రవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో శాంతిభద్రతలపై సిఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. త్రిశూల్ పేరిట ఈ మూడు అంశాలపై రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. >>2



2లో

## సంస్కరణలు తెస్తున్నాం!

పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా కార్యాచరణ ఉండాలి

ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీలు పరిశ్రమలతో అనుసంధానం

జిల్లా కలెక్టర్ల సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

## రెండు డిఎలు విడుదల

సెప్టెంబర్ జీతంతో కలిపి చెల్లింపు, ఉత్తర్వులు జారీ

**విజయవాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** వినాయక చవితి పండుగ వేళ ఉద్యోగులకు, పింఛనుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలు విడుదల చేస్తూ ఆర్థికశాఖ ఉత్త ర్వులు జారీ చేసింది. పెంచిన డిఎలను సెప్టెంబర్ జీతానికి కలిపి >>2

కేరళంలోని త్రిప్రయార్ శ్రీరామస్వామిని దర్శించుకున్న డిసిఎం పవన్ 2లో






# తిరుమలకొండంతా భక్తజనం

- శ్రీవారి దర్శనార్థం లక్షకు పైగా భక్తులు రాక
- శ్రీవేంకటేశ్వరస్వామి సర్వదర్శనానికి 30గంటలు
- ఆదివారం 'విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు





శ్రీవారి సేవలో సినీనటులు శ్రియా శరణ్, కృతిశెట్టి

**తిరుమల, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుస సెలవులు కలసి రావడంతో వారాంతంతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం శుక్రవారం ఉదయానికే లక్షమందికిపైగా భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. రెండవ శని, ఆదివారం, సోమవారాలు కలసి రావడంతో శుక్రవారం ఉదయం 5గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1, 2 క్యాకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. శిలాతోరణం వరకు లైన్లలో భక్తులు వేలాదిమంది బారులుతీరి నిలబడ్డారు.

ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం నిరీక్షణ తప్పడం లేదు. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తు గా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 47వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. గురువారం రాత్రివరకు 69,771మంది భక్తులకు మహాలఘు లో దర్శనం చేయించారు. కానుకల ద్వారా రూ.6.94కోట్ల హుండీ ఆదాయం లభించింది.

**రేపు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు:** తిరుమలలో భక్తుల అనూహ్య రద్దీ నెలకొంది. ప్రస్తుతం క్యూలైన్లలోని భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. నేటి నుండి 14వ తేది వరకు వరుస సెలవుల రానున్న నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముంది.

ఈ కారణంగా 13వ తేది ఆదివారం 'విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. నేడు శనివారం సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఆదివారం రద్దు చేయబడిన విఐపి బ్రేక్ దర్శన సమయాన్ని సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు వినియోగించడం జరుగుతుంది. ఈ విషయాన్ని గమనించి భక్తులు టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**శ్రీవారి సేవలో సినీనటులు:** పుట్టినరోజున ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అభిషేకసేవలో పాల్గొని దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందని సినీనటి శ్రియా శరణ్ తెలిపారు. ప్రతి యేడాది పుట్టినరోజున స్వామివారి సేవలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందని, శుక్రవారం వేకువజామున కూతురితో కలిసి కుటుంబ సభ్యులతో సహా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె ఆలయంలోనికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమెతో బాటు సినీనటి కృతిశెట్టి శ్రీవారిని దర్శించుకున్నారు.

# శతాబ్దం కాలం నాటి భూ సమస్యలూ పరిష్కరిస్తున్నాం

- ఎపికి వచ్చే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా నైపుణ్య శిక్షణ
- పిఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయండి
- 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని భూముల వివాదాలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల చాలా భూములు వివాదాల్లోకి వెళ్లాయని, ఈ వివాదాలను పరిష్కరించడంతోపాటు శతాబ్ద కాలం నుంచి వివాదంలో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు. దీంట్లో భాగంగా ఇప్పటి వరకు 232 సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ వివాదాలను క్లియర్ చేశామని, వీటి విలువ సుమారు రూ.5 వేల కోట్లు ఉంటాయని, మొత్తంగా సుదీర్ఘంగా వివాదంలో ఉన్న 31వేల ఎకరాలకు విముక్తి కల్పించామని సిఎం చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున రెవెన్యూ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పురపాలక, విద్యుత్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ "వివిధ జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు త్వరిత గతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోండి. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య. అలాంటి సమస్యను పరిష్కరించ గలిగాం. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాల్లో ఎక్కడా అవినీతి లేకుండా భూ సమస్యల్ని పరిష్కరించాలి. మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యల్ని పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రీసర్వే ప్రక్రియ పూర్తైన భూము లకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలి. నవం బరు 1 నుంచి రియల్ టైమ్‌లో ఇంటిగ్రేషన్ చేయండి. రెవెన్యూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వం తీసుకుంటు న్న పాలసీలగురించి ప్రజలకు వివరించాల్ని అని చెప్పారు.

**నిరంతరాయంగా నైపుణ్యాభివృద్ధి:** "రాష్ట్రంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో యువత ఉంటారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించటం నిరంతర ప్రక్రియ. పిఎం సేతు కార్యక్రమాన్ని విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకూ విస్తరించి యువతకు మరిన్ని నైపుణ్యా లు కల్పించాలి. పరిశ్రమలు నుంచి సీఎస్ఆర్ నిధులతో నూ ఈ నైపుణ్యాలను కల్పించే అంశాన్ని పరిశీలించండి. ఎపికి వచ్చే పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న మన యువతే ఉద్యోగాలు పొందేలా కార్యాచరణ చేపట్టాలి. నియోజక వర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు నిర్వహించాలి. ఇప్పటి వరకూ 4.98 లక్షల మంది యువత నైపుణ్యం పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నైపుణ్య కల్పనపై ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాలి.



# పెన్షన్ల కోసం చిన్న కుటుంబాలుగా విడిపోవద్దు

- పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా సంక్షేమం.. ఇదే కూటమి ప్రభుత్వ విధానం
- కొత్త పెన్షన్లకు ముందే ఫ్యామిలీ యూనిట్ మ్యాపింగ్ పూర్తవ్వాలి
- అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేయండి
- యానాటి కొండ సామాజిక వర్గానికి ఎస్టీలకు కలిగే ప్రయోజనాలు
- సూపర్ సిక్స్ పథకాల అమలుపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్షేమ పథకాల ప్రయోజనాల కోసం చిన్న కుటుంబాలుగా విడగొట్ట కుండా... భవిష్యత్తులో అన్ని పథకాలను ఫ్యామిలీ యూనిట్ గానే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొత్త పెన్షన్ల జారీకి ముందే కుటుంబాల మ్యాపింగ్ చేపట్టాలని, ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులను యథాతథంగా కొనసాగిస్తూనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రేషన్, పెన్షన్ల కోసం కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారిపోవడం సరికాద న్నారు. పెద్ద కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఆ కుటుం బానికి ఎక్కువ ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్య మని స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ విధానమని, దానికి అను గుణంగానే పాలసీలు, కార్యాచరణ ఉండాలని సిఎం చంద్ర బాబు వెల్లడించారు. 8వ కలెక్టర్ల సమావేశం రెండో రోజున సూపర్ 6 పథకాలపై కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు.

**సంక్షేమం నుంచి కుటుంబ సాధికారత విధానంతో ముందుకు:** కుటుంబంలో ఎంత మంది ఉంటే... అంత మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించేలా చూడాలని సిఎం సూచించారు. సంక్షేమ పథకాల అమలులో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలన్నారు. వివిధ పథకాల్లో ఉన్న లోటుపాట్లను సరిచేసి అత్యుత్తమ విధానాలను రూపొందించా లని ఆదేశించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల మేర ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. ఇందులో ఒక్క పెన్షన్లకే రూ.75 వేల కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంక్షేమ విధానాలు ఉండాలన్నారు. సంక్షేమం నుంచి కుటుంబాలను సాధికారత దిశగా తీసుకెళ్లే 'వెల్ఫేర్ టు ఎంపవరింగ్ ఫ్యామిలీస్' విధానంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సెర్ప్, మెప్మా ద్వారా 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. ఐదు లక్షల మంది మహిళలను ఎంట్రప్రెన్యూ ర్లుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వివిధ సామాజిక వర్గాలను సాధికారత దిశగా తీసుకెళ్లాలి.. అందర్నీ అభివృద్ధి చేయాలన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్య మైన ఉత్పత్తులతో పాటు మెరుగైన విద్య అందించాలన్నారు. పి4 కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్లకు సిఎం దిశానిర్దేశం చేశారు.

**విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి చొరవ**

ప్రతి నెలా మొదటి తేదీని 'పేదల సేవల్లో' కార్యక్రమం ద్వారా సంక్షేమానికి కేటాయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అదే విధంగా ప్రతి నెలా 9న 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నాలుగో శనివారం పౌరుల ఆరోగ్య నిర్వహణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల 'సంజీవన్ని' కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశిం చారు. వీటితో పాటు మంచి ఆలోచనలు, విలువలతో కూడిన సమాజ నిర్మాణం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు, శిశువుల్లో రక్తహీనత వంటి సమస్య లను పరిష్కరించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఇదే 2047 విజన్‌లో కీలక లక్ష్యమని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న కాపు కార్పొరేషన్ భవనాలను పూర్తి చేయాలన్నారు.

**బుడగజంగాల తరహాలో...:**

శ్రీకాకుళం జిల్లాలో యానాటి కొండ సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్‌ను కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. చాలా కాలంగా యానాటి కొండ సామాజిక వర్గం వాళ్లు తమను ఎస్టీల్లో చేర్చాలని కోరు తున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఎస్టీల్లో చేర్చే అంశం కేంద్రం పరిధిలో ఉంటుందని, ఈలోగా ఎస్టీలకు వర్తింపచేసే ప్రయోజనాలను యానాటి కొండ సామాజిక వర్గానికి అందించాలని ఆదేశించారు. బుడగ జంగాల తరహాలో యానాటి కొండ సామాజిక వర్గానికి లబ్ది చేకూర్చాలన్నారు. మంత్రులు, సిఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు.

# ప'వర్రీ' కాకూడదు!

- విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తం కండి
- వేసవి కాలానికి ముందస్తు కొనుగోళ్లు
- కరెంట్ కోతల్లేకుండా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం



**విజయవాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగి న నేపథ్యంలో విద్యుత్ పరిస్థి తిపై ఇంధన శాఖ మంత్రి గొట్టి పాటి రవి కుమార్ అధికారుల తో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ వినియోగం వేసవిని తలపించే స్థాయిలోనే కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం రోజుకు 280 నుంచి 290 మిలియన్ యూనిట్ల మేర విద్యుత్ వినియోగం నమోదవుతోందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటి లోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణం గా ముందుగానే విద్యుత్‌ను కొనుగోలు చేయాలని అధి కారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. అవసరమైన విద్యుత్‌ను ముందస్తుగా సమకూర్చుకోవడం ద్వారా భవి ష్యత్తులో కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సూచిం చారు. విద్యుత్ డిమాండ్, సరఫరా పరిస్థితులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. డిమాండ్ పెరిగే అవకాశాలను అంచనా వేసి అందుకను గుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

**ప్రజలకు ఇబ్బందులు రాకూడదు:** విద్యుత్ కొరత కారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిస్కంలు, విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

# వెబ్‌ల్యాండ్‌లో అక్రమాలకు తావులేకుండా బ్లాక్‌చైన్ సాంకేతికత

## 22ఏ నిబంధనల సరళీకరణతో 16 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాం: సిసిఎల్ఎ

**విజయవాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** 22ఏ నిబంధనల సరళీకరణతో 16 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించామని సిసిఎల్ఎ జయలక్ష్మి వెల్లడించారు. కలెక్టర్ల సదస్సు రెండోవ రోజు రెవెన్యూ, భూపరిపాలన అంశాలపై ప్రత్యేక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా భూ సమస్యల పరిష్కారం, రీసర్వే పురోగతి, 22ఏ నిషేధిత జాబితా సవరణలపై భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సమగ్ర వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వేకు తీసుకున్న మొత్తం 16,816 గ్రామాల్లో ఇప్పటివరకు 9,005 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన 7,811 గ్రామాల్లో వచ్చే నవంబర్ నాటికి మరో విడత పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, దశాబ్దాలుగా నలుగుతున్న చారిత్రక భూ వివాదాలు అన్నింటినీ రాబోయే మార్చి నాటికి నూటికి నూరు శాతం పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

### చాట్‌బోట్ ద్వారా 23,100 అర్జీల నమోదు

- పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఆదర్శంగా 4 జిల్లాలు: ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్

**విజయవాడ, సెప్టెంబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కొత్తగా అందుబాటులోకి తెచ్చామని ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని భాస్కర్ తెలిపారు. దీనివల్ల గ్రీవెన్స్ పరిష్కారం మరింత సులభతరమవు తుందని దీన్ని కలెక్టర్లు సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఆయా జిల్లాల్లు, మండలాల్లో గ్రీవెన్స్ పరిస్థితి ఎలా ఉంది, ఎక్కడెక్కడ ఎన్ని అపరిష్కృత అర్జీలు ఎక్కువ ఉన్నా యనే విశ్లేషణ ఏఐ ఆధారిక పిజిఆర్ఎస్‌లో ఉంటుందని దీనిద్వారా కలెక్టర్లు ఆ దిశగా దృష్టి కేంద్రీకరించడానికి వీలవుతుందన్నారు. అలాగే పౌరులు కూడా ఏఐ ఆధారిత పిజిఆర్ఎస్‌లో తమ మొబైల్ నుంచే తమ అర్జీ నమోదు చేయవచ్చని, తమ అర్జీ స్థితిగతులు చాలా సులభంగా తెలుసుకోవచ్చన్నార ు. ఇప్పటికే 23,100 ఫిర్యాదులు నమోదయ్యాయని చెప్పారు. ఏఐ ద్వారానే ఈ ఫిర్యాదుల పరిష్కారం అయిన తర్వాత ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆటోమేటిగ్గా తెలుసుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా), (CIN: L36911RJ1996PLC011381)

అనుబంధం-IV-A- (నియమం 8 (6) నిబంధన చూడండి)

స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని నిబంధనతో సహా, దాని ప్రకారం స్థిరాస్తుల అమ్మకానికి సంబంధించిన ఇ-వేలం అమ్మకపు ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) ప్రకారం. సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/గ్యారంటర్/తాకట్టుదారు(ల)కు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు పెట్టబడిన, మరియు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ అయిన AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న, క్రింద వివరించబడిన స్థిరాస్తులకు సంబంధించి, ఇకపై AUSFBగా సూచించబడే ఈ సెక్యూర్డ్ ఆస్తులు, AUSFB అనగా సెక్యూర్డ్ క్రెడిటర్‌కు చెల్లించవలసిన అదనపు వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు, క్రింద పట్టికలో పేర్కొన్న మొత్తాన్ని వసూలు చేయడం కోసం ఇ-వేలం ద్వారా "ఉన్నది ఉన్నట్లుగా", "ఉన్నది ఉన్నట్లుగా", మరియు "ఏది ఉంటే అది" అనే ప్రాతిపదికన అమ్మబడతాయి. మేము https://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్ ద్వారా బహిరంగ ఇ-వేలం నిర్వహించబోతున్నామని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

| ఖాతా సం. & రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తనఖాదారులు, హామీదారుడి పేరు | సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు ప్రకారం తేదీ & మొత్తం మరియు భౌతిక స్వాధీనం చేసుకున్న తేదీ & ఆ (తేదీ) నాటికి ఉన్న మొత్తం | రిజర్వ్ ధర, బయానా & బిడ్ పెంపు మొత్తం (రూపాయలలో) | ఇ-వేలం తేదీ మరియు సమయం, బయానా సమర్పణకు చివరి తేదీ, బిడ్లు & డాక్యుమెంట్లు సమర్పించాల్సిన ప్రదేశం, పరిశీలన తేదీ |
|---|---|---|---|
| (రుణ ఖాతా నం.) 2406262158314262 M/S. అభినవ్ ఏజెన్సీస్ దాని యజమాని శ్రీ యెజెల్ల మాధవ వర్మ ద్వారా (రుణగ్రహీత), శ్రీ యెజెల్ల మాధవ వర్మ తండ్రి: శ్రీ అప్పలరాజు యెజెల్ల (హామీదారు/తాకట్టుదారు), శ్రీమతి యెజెల్ల ప్రేమ కుమారి భర్త: శ్రీ అప్పలరాజు యెజెల్ల (హామీదారు) | 13(2) నోటీసు జారీ చేసిన తేదీ: 01/12/2025 రుణ ఖాతా నం. 2406262158314262 బకాయి మొత్తం రూ. 93,23,561/- (రూపాయలు తొంభై మూడు లక్షల ఇరవై మూడు వేల ఐదు వందల అరవై ఒకటి మాత్రమే) 29-11-2025 నాటికి భౌతిక స్వాధీనం చేసుకున్న తేదీ: 17-08-2026 రుణ ఖాతా సం. 2406262158314262 బకాయి మొత్తం రూ. 1,03,04,887/- (రూపాయలు ఒక కోటి మూడు లక్షల నాలుగు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు మాత్రమే) 31-ఆగస్టు-2026 నాటికి, దీనికి అదనంగా భవిష్యత్తు వడ్డీ & ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. | రిజర్వ్ ధర: రూ. 75,00,000/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షలు మాత్రమే) బయానా రూ. 7,50,000/- (రూపాయలు ఏడు లక్షల యాభై వేలు మాత్రమే) బిడ్ పెంపు మొత్తం: రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే) | 22 అక్టోబర్ 2026 ఉ.11:00 గం. నుండి మ.01:00 గం. వరకు ఐదు నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో బిడ్ సమర్పణకు చివరి తేదీ: 21 అక్టోబర్ 2026, సా.05:00 గం. వరకు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ శాఖ - ఈశ్వర్ ప్యారడైజ్, డోర్ నంబర్ - 47-14-4 & 5, ద్వారకా నగర్ మెయిన్ రోడ్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530016 ఇ-మెయిల్ ఐడి: bhanu.singh3@aubank.in పరిశీలన తేదీ: 24 & 25 సెప్టెంబర్ 2026 |

**తనఖా ఆస్తి వివరణ**

విజయనగరం జిల్లా, కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధి, లక్కవరపుకోట మండలం, లక్కవరపుకోట తలారి గ్రామం, తలారి గ్రామ పంచాయతీ, సర్వే నెం. 100/11P లోని ప్లాట్ నెం. 253 గల 533.33 చదరపు గజాలు, లేదా 445.86 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, స్థిరాస్తి ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా మొత్తం అదంతా - వైస్ చైర్మన్ VMRDA వారి ప్రొసీడింగ్, ఫైల్ నెం. 1167/0038/LP/VMRDA/2021 Dt. ద్వారా 02-07-2021 మరియు ఎల్.పి. నెం. 33/2021/1167/VMRDA/DPMS. "లియో రిసార్ట్స్" ఫేజ్ -2 పేరున, కొత్తవలస జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. యజమాని శ్రీ యెజెల్ల మాధవ వర్మ. సరిహద్దులు:- **తూర్పు- కంపెనీ భూమి, పడమర- 40 అడుగుల రోడ్డు, ఉత్తరం- ప్లాట్ నెం. 254, దక్షిణం- ప్లాట్ నెం. 252, మొత్తం నిర్మిత విస్తీర్ణం సుమారు 2100 చ.అ.**

గమనిక:- స్వాధీనం చేసుకునే సమయంలో తనఖా ఆస్తి టున్న ఏదైనా సరుకు, గోడకు శాశ్వతంగా అమర్చిన వస్తువులు మరియు ఫిక్చర్, స్టాక్, విలువైన చర ఆస్తులు లేదా సామాగ్రి అమ్మకంలో భాగంగా పరిగణించబడతాయి.

ఆసక్తి గల పాల్గొనేవారు/బిడ్డర్లు ఈ-వేలం ప్రక్రియలో పాల్గొనడానికి మరియు నిబంధనలు & షరతులతో సహా మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించాలని కోరడమైనది. అలాగే, **శ్రీ భాను ప్రతాప్ సింగ్, సంప్రదింపు నంబర్: 9358002663, ఇ-మెయిల్: bhanu.singh3@aubank.in** ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది.

**ఇది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) ప్రకారం రుణగ్రహీత/తాకట్టుదారులకు ఇచ్చే చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు కూడా**

**ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నిబంధనలు మరియు షరతులు:-**

1. సురక్షిత రుణదాత (అంటే AUSFB) తరఫున నిర్వహించబడే ఈ సురక్షిత ఆస్తి యొక్క ఈ-వేలం అమ్మకం "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఎటువంటి బాధ్యత లేకుండా" అనే ప్రాతిపదికన జరుగుతుంది; మరియు సదరు ఆస్తిపై ఎటువంటి తెలిసిన భారం లేదు. 2. ఆన్‌లైన్ ఈ-వేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ పత్రం, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ అయితే బోర్డ్ రెజల్యూషన్, ఫోటో ఐడి మరియు చిరునామా రుజువుతో పాటు EMD (ఆర్నెస్ట్ డిపాజిట్) సమర్పించాల్సి ఉంటుంది. ఈ EMDని RTGS/NEFT ద్వారా "MSME AUCTION POOL ACCOUNT OF AU Small Finance Bank Limited" పేరుతో చెల్లించాలి (కరెంట్ ఖాతా నం. 1921201121711599; చిరునామా: AU SMALL FINANCE BANK LIMITED, 5వ మరియు 6వ అంతస్తు, Sunny Big Junction, STC Khasra No. 64 to 67, Gram Sukhaipura, New Atish Market, Jaipur 302020, IFSC కోడ్: AUBL0002011). ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోవడం సాధ్యం కాదు. అలాగే, బిడ్డర్ సమర్పించిన EMDకి సంబంధించిన RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్ మరియు రద్దు చేసిన చెక్ కాపీని ఈ క్రింది ఈ-మెయిల్ ఐడికి పంపాల్సి ఉంటుంది: **bhanu.singh3@aubank.in**

3. ఈ-వేలం ప్రక్రియలో పాల్గొనడానికి మరియు నిబంధనలు & షరతులతో సహా ఇతర వివరాలను తెలుసుకోవడానికి, ఆసక్తి గల పాల్గొనేవారు/బిడ్డర్లు https://sarfaesi.auctiontiger.net మరియు https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌లను సందర్శించాలని కోరడమైనది. అలాగే, **శ్రీ భాను ప్రతాప్ సింగ్, సంప్రదింపు నంబర్: 9358002663, ఈ-మెయిల్: bhanu.singh3@aubank.in)** సంప్రదించవలసిందిగా సూచించడమైనది.

తేదీ : 10-సెప్టెంబర్-2026 ప్రదేశం : విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్



Ref/B1/124/2026 ది.11-09-2026

కలెక్టర్ (భూ సేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

**ఫారం నెం.VII**

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 125 సబ్ రూల్ (1) ననుసరించి)

**రూఢీ ప్రకటన**

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.19.34 సెంట్లను ప్రజా ప్రయోజనముకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం వలన ముంపునకు గురైన వి.ఆర్.పురం మండలం, చింతరేవులపల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము" భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టం లోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరంవారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టం లోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

**రూఢీ ప్రకటన**

ప్రత్యేక కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టం లోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.19.34 సెంట్లను ప్రజా ప్రయోజనముకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం వలన ముంపునకు గురైన వి.ఆర్.పురం మండలం, చింతరేవులపల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము" అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : పోలవరం మండలం : లద్దతీగల గ్రామం : తిమ్మాపురం

| క్రమ సంఖ్య | సర్వే నెం | వర్గీకరణ | మొత్తం విస్తీర్ణం య. సెంట్లు | భూ సేకరణ క్రింద విస్తీర్ణం య. సెంట్లు | పట్టదారుని పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/ కట్టడములు వగైరా వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) |
| 1) | 46-4 | పుంజ | | 3.39 | బొంకు కమలమ్మ (భర్త) మాణిక్యం | స.నెం. 47 | స.నెం. 46/3 | స.నెం. 41 | స.నెం. 46/3 | |
| 2) | 46-4 | పుంజ | 7.62 | 2.36 | సాక ఆనంద సరోజానీదేవి (తండ్రి)మాణిక్యం | స.నెం. 47 | స.నెం. 46/3 | స.నెం. 41 | స.నెం. 46/3 | టేకు-4 తాడి-10 |
| 3) | 46-4 | పుంజ | | 1.87 | బొమ్మిడి వెస్లీ జాన్ ప్రభాకరరావు (తండ్రి) మాణిక్యం | స.నెం. 47 | స.నెం. 46/3 | స.నెం. 41 | స.నెం. 46/3 | |
| 4) | 48 | పుంజ | | 6.81 | బొమ్మిడి మాణిక్యం (తండ్రి) వెంకటస్వామి | స.నెం. 33, 31 | స.నెం. 49,46 | స.నెం. 46,47 | స.నెం. 30, 31 50 | టేకు-4 తాడి-8 వేప-2 బోరు-1, కుంకుడు-1 |
| 5) | 48 | పుంజ | 11.72 | 1.52 | బొమ్మిడి వెస్లీ జాన్ ప్రభాకరరావు (తండ్రి) మాణిక్యం | స.నెం. 33, 31 | స.నెం. 49,46 | స.నెం. 46,47 | స.నెం. 30, 31 50 | |
| 6) | 48 | పుంజ | | 3.39 | బొమ్మిడి కృపాసాగర్ (తండ్రి) మాణిక్యం | స.నెం. 33, 31 | స.నెం. 49,46 | స.నెం. 46,47 | స.నెం. 30, 31 50 | |
| మొత్తం | | | | 19.34 | | | | | | |

ఈ భూముల ప్లానులు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్ -1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయం లోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టంలోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు(భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూములను మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

ప్రదేశము : రాజమహేంద్రవరం
తేది : 27-08-2026.

వి.అభిషేక్, ఐఎఎస్
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం.

జి.కనకరాజు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం.

12-9Pg6exHMNWJQE.qxd:12-9Pg6exHMNWJQE.qxd 1/1/02 8:18 AM Page 1





రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## రైల్వే స్టేషన్‌లలో పోలీసుల విస్తృత తనిఖీలు

**ఒరిస్సా నుంచి గంజాయి సరఫరా అవుతుందన్న అనుమానంతో.. అనుమానుతుల్ని అదుపులో తీసుకున్న పోలీసులు.**

**అనంతపురం, సెప్టెంబర్ 11,( ప్రభాతవార్త బ్యూరో)** గంజాయి ఇతర ప్రాంతాలకు రైళ్ల ద్వారా ఒరిస్సా నుంచి సరఫరా చేస్తున్నారని అనుమానంతో సిఆర్పిఎఫ్ పోలీసులు, స్థానిక పోలీసులు శుక్రవారం ఉదయం రైళ్లల్లో విస్తృత తనిఖీలు చేసినట్లు సమాచారం. ప్రధానంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఒరిస్సా రాష్ట్రం నుంచి విశాఖపట్నం, విజయవాడ మీదుగా బెంగళూరు వెళ్తుంది. అదే ట్రైన్ బెంగళూరు నుంచి ఒరిస్సా కూడా రోజు వెళ్తుంది. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ లోనీ ప్రతి పెట్టెలోను, ప్రయాణికులను తనిఖీలు చేయడంతో పాటు అనంతపురం, ధర్మవరం, హిందూపురం తదితర స్టేషన్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేసినట్లు సమాచారం. ఒరిస్సా నుంచి బెంగళూరుకు గంజాయి సప్లయ్ చేస్తున్నారన్న సమాచారంతో ప్రశాంతి ఎక్స్ ప్రెస్ రైలులో పోలీసులు తనిఖీ లు చేశారు. గుంతకల్ , అనంతపురము, దర్మవరం, పెనుకొండ, హిందూపురం రైల్వే స్టేషన్ లలో సి . ఆర్.పి.ఎఫ్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. హిందూపురం రైల్వే స్టేషన్ లో ప్రశాంతి ఎక్స్ ప్రెస్ రైలులో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు అనుమానుతులను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఒరిస్సాకు చెందిన ఒక వ్యక్తి దగ్గర గంజాయి ప్యాకెట్లు లభ్యం అయినట్లు, అందులో భాగంగా అతని సూట్ కేసును కూడా తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇదిలా ఉండగా నిన్నటి రోజు గురువారం రాత్రే ఆత్మకూరు పోలీస్టేషన్ పరిదిలో ముగ్గురు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. వారం రోజుల క్రితం గుంతకల్ రైల్వే స్టేషన్ లో గంజాయి గ్యాంగ్ ను పట్టుకొని భారీగా గంజాయిను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## విఐపి దర్శనం పేరుతో నకిలీ అధికారులపై కేసు నమోదు

**తిరుపతి,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి విఐపి దర్శనం, గదులు ఇప్పిస్తామని భక్తులను మోసం చేస్తున్న టిటిడి నకిలీ సూపరింటెండెంట్లపై తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. టిటిడిలో సూపరింటెండెంట్ హోదాలో నకిలీలు చలామణి అవుతూ భక్తులను బురిడీ కొట్టిస్తున్న ముగ్గురు వ్యక్తులపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు. వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన ఓ ప్రైవేట్ కాలేజీ లెక్చరర్ ప్రసన్నకుమార్ కుటుంబంతో తిరుమలకు చేరుకున్నారు. అప్పటికే టిటిడిలో సూపరింటెండెంట్‌నంటూ చిన్నంగారి రమణ అనే వ్యక్తి పేరుతో ప్రసన్నను సంప్రదించాడు. విఐపి దర్శనం, గదులు ఇప్పిస్తానని చెప్పి బాధితుడి నుండి 22వేలు రూపాయలు నగదు వసూలు చేశాడు. ఆ తరువాత దర్శన టిక్కెట్లు సంబంధించి వెబ్‌సైట్ పనిచేయడం లేదని, సర్వర్ బిజీ అంటూ రాత్రంతా కొండపైన అటూ ఇటూ తిప్పుతూ మానసిక వ్యథకు గురిచేశాడు. అడిగితే పొంతనలేని సమాధానం చెబుతూ ఇప్పుడే వస్తానని చెప్పి తప్పించుకున్నాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మోసాలతో సంబంధం ఉన్న నకిలీ అధికారులు మోకాటి సుబ్రహ్మణ్యం, రమపై కూడా కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనాలు, గదుల కేటాయింపులు కేవలం అధికారిక వెబ్‌సైట్ ద్వారానే పొందాలని సూచించారు.

## భగవంతుని బ్రహ్మోత్సవాల నిర్వహణకు కంకణభట్టార్‌గా వెంకట రాఘవ దీక్షితులు



**తిరుమల ,సెప్టెం బర్ 11ప్రభాత వార్త ప్రతినిధి:** ఆపద మొక్కుల వాడు... తిరు మల శ్రీవేంకటేశ్వర స్వామికి తొమ్మిది రోజుల పాటు జరిపించే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈ ఏడాది ఉత్సవాలు, వాహనసేవల సాఫీ నిర్వహణకు కంకణభట్టార్‌గా వెంకట రాఘవ దీక్షితులు నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో తొమ్మిదిరోజులు స్వామివారి వాహనసేవలు, ఆయా వాహనాల్లో మలయప్ప అలంకరణలు పూర్తిగా జరుగుతాయి. భక్తిపూర్వకంగా కంకణం ధరించి స్వామివారి బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఆయన వంతుకృషి చేస్తారు. 15నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు కంకణ భట్టాచార్యులుగా తిరుపతమ్మ కుటుంబానికి చెందిన వెంకట రాఘవ దీక్షితులు బాధ్యత వహిస్తారు. అంకురార్పణ నుండి చక్రస్నానం వరకు వైదిక కార్యక్రమాల్లో ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఉత్సవమూర్తుల అలంకరణకు చెన్నై, కార్వేటినగరం నుండి ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు ఎంపికయ్యారు.

# టిటిడి పై వాస్తవ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### - సామాజిక మాధ్యమాలు అవగాహనతో ఉండాలి



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం ధార్మికసంస్థపై వార్తలు రాసేముందు స్పష్టంగా విషయాలు తెలుసుకుని ప్రచురిస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెలిబుచ్చారు. టిటిడి సంస్థ ప్రతిష్ట దెబ్బతినేలా చిన్న చిన్న విషయాలను కూడా ఇటీవల సామాజిక మాధ్యమాల్లో అవగాహన లేకుండా ప్రసారం చేయడం మంచిదికాదని అన్నారు. ఏదేని టిటిడి విషయాలకు సంబంధించి కొంత ఆలస్యమైనా నిజాలు తెలుసుకొని ప్రచారం చేస్తే ఇబ్బంది ఉండదన్నారు. ప్రధానంగా తిరుమల మీడియాకు సంబంధించి ప్రచురితమైన వార్తల్లోని సారాంశాలనే సామాజిక మాధ్యమంలో కూడా మరింత విస్తృతంగా అంశాలను ప్రచారం చేస్తుండటం గమనిస్తున్నామన్నారు. ఈ విషయాలపై మీడియా ద్వారా వాస్తవ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అవగాహన ఉన్న మీడియా ప్రతినిధులు వాస్తవాలు రాస్తారని.. అవగాహన లేని వారే తప్పుడు ప్రచారాలు చేస్తారని నొక్కి వక్కాణించారు. ధార్మిక సంస్థ టిటిడి ప్రయోజనం దెబ్బతినకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగుల కంటే తిరుమల మీడియా ప్రతినిధులపైనే ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ ఏడాది శ్రీవారికి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు 17రోజుల తేడాతోనే నిర్వహించాల్సికోవడం ఈ ఉత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అదనపు ఇఒ వెంకయ్య చౌదరి సూచించారు. తిరుమలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్య గత ఏడాది కంటే ఈ ఏడాది 15 శాతం అదనంగా పెరిగిందని దీంతోపుట్టుకొస్తున్న నకిలీ వెబ్సైట్లు శ్రీవారి టికెట్లు మంజూరు చేస్తామంటూ భక్తులను అనేక విధాలుగా మోసం చేస్తున్న నకిలీ సంస్థలతో జాగ్రత్తగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. డిజిటల్ వ్యవస్థ ద్వారా నకిలీ వెబ్‌సైట్లు, మోసగాళ్ళను కట్టడిచేస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో తిరుమలకు బహ్మోత్సవ దినాలలో కీలకమైన గరుడసేవ చక్రస్నానం రథోత్సవం రోజులలో భక్తుల రద్దీని ఏ విధంగా క్రమబద్ధీకరించాలని దిశగా ప్రణాళిక రూపొందించామన్నారు. సాధారణ రోజుల్లో కూడా తిరుమలకు వచ్చే యాత్రికుల రద్దీ తగ్గడం లేదని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రోజులలో ఒక స్థాయికి మించి భక్తులను తిరుమలకు అనుమతించకుండా తిరుపతిలోనే నిరోధించడం తప్పనిసరి అవుతుందన్నారు. తిరుమలలో 16 వేల వాహనాలకు మించి పార్కింగ్ చేసుకునేందుకు స్థలాలు లేవని కాబట్టి తిరుపతి అలిపిరి సమీపంలోని జూ పార్క్ రోడ్డులో ఐదారు పెద్ద స్థలాలను గుర్తించి పార్కింగ్ ఏర్పాట్లను చేపట్టామన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కరవు తాండవిస్తున్నా సిఎం పట్టించుకోవడం లేదు

### - వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్

విజయవాడ,సెప్టెంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కరవు తాండవిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనీసం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలై రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని మండిపడ్డారు. వర్షపాత లోటు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఎటువంటి కంటింజెన్సీ ప్లాన్ లేదని దుయ్యబట్టారు. గత చరిత్రను గుర్తుచేస్తూ, రాష్ట్రంలో ఖచంద్రబాబు కరవుఖ రెండూ కవల పిల్లల్లా కలిసి వస్తాయన్న నానుడి మరోసారి నిజమైందని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కరవు వెంటే వస్తుందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు అదే నిజమైంది. రాష్ట్రంలో దాదాపు 55 శాతానికి పైగా వర్షపాత లోటు ఉంది. ఎన్నినో పేరు చెప్పి కాలయాపన చేయడం తప్ప, రైతును ఆదుకోవడానికి ఈ ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికా లేదు. వరి వేయొద్దని చెప్పారు, తీరా చూస్తే వేరుశనగ, కంది వంటి ప్రత్యామ్నాయ పంటలు కూడా సాగు కాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాయలసీమలో 30 నుంచి 35 శాతం విస్తీర్ణంలో సాగే కాలేదు. నెల్లూరు బ్యారేజీ కింద వేసిన 3,500 ఎకరాల పంట నీళ్ల లేక ఎండిపోయింది. కృష్ణా డెల్టాలో నార్లు ఎండిపోయే దుస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబుకు కొబ్బరికాయలు కొట్టడం, పూలు చల్లుకోవడం, ప్రచార ఫోటోలు తీసుకోవడంపై ఉన్న శ్రద్ధ రైతుల పొలాలకు నీరివ్వడంపై లేదు. శ్రీశైలంలో నీళ్లున్నా రాయలసీమ ప్రాజెక్టులకు సక్రమంగా నీళ్లివ్వలేని అసమర్థ పాలన ఇది. చివరికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లు తెగిపడేంత దారుణంగా నిర్వహణను గాలికొదిలేశారు. చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడానికే పరిమితం కానీ, రైతు సంక్షేమంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ఏమాత్రం సాటిరారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి రాకముందు రైతులు రాత్రిపూట టార్చ్ లైట్లు పట్టుకుని పొలాల వెంట తిరిగిన చీకటి రోజులను చంద్రబాబు మళ్లీ గుర్తుచేస్తున్నారు. రాష్ట్రంలో తీవ్ర విద్యుత్ కొరత సృష్టించి రాత్రి 2 గంటలకు కరెంట్ ఇస్తున్నారు. వ్యవసాయానికి పగటిపూట నిరంతరాయంగా 9 గంటల ఉచిత విద్యుత్‌ను ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు.

# ఆస్తి కోసమే జగదీశ్వర్ రెడ్డి హత్య?

**- సైనైడ్ నేనే ఇచ్చా: సాదిక్ ఖాన్ - కొబ్బరినీళ్లలో కలిపి ఇచ్చినట్లు అంగీకారం**

**- ముగిసిన పోలీసుల కస్టడీ - అమలాపురం కోర్టుకు తరలింపు - 18వరకు రిమాండ్**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లాలో సంచలనం రేపిన పిఠాపురం పంచాయతీరాజ్ ఎఇ నూకరాజు కుటుంబం ఆత్మహత్య, ఆయన అల్లుడు జగదీశ్వర్ రెడ్డి అత్యకు సంబంధించి నిందితుడు సాదిక్ ఖాన్‌ను శుక్రవారం అమలాపురం స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి ముందు పోలీసులు హాజరుపరిచారు. మూడు రోజులు కస్టడీకి తీసుకున్న సర్పవరం పోలీసులు గడువు ముగియడంతో పోలీసులు సాదిక్ ఖాన్‌ను అమలాపురం కోర్టుకు తరలించారు. విచారణ అనంతరం న్యాయమూర్తి సాదిక్ ఖాన్‌కు ఈ నెల18వ తేదీ వరకు జ్యుడిషియల్ కస్టడీ విధించారు. నిందితుడు సాదిక్ ఖాన్‌ను అమలాపురం నుంచి రాజమహేంద్రవరం సెంటర్ జైల్‌కు పోలీసులు ప్రత్యేక వాహనంలో తరలించారు. రాజమండ్రి స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం అమలాపురం ఇంచార్జ్ న్యాయమూర్తి కావడంతో సాధిక్ ఖాన్‌ను అమలాపురం తీసుకురావడం జరిగిందని పోలీసులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఎఇ టి.నూకరాజు అల్లుడు జగదీశ్వరరెడ్డి హత్య కేసులో నిందితుడు సాదిక్ ఖాన్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. తొలి రెండు రోజులు తనకేమీ తెలియదని చెప్పిన సాదిక్, పోలీసులు సాంకేతిక ఆధారాలు, సైనైడ్ విక్రయించిన వ్యక్తుల వివరాలను చూపడంతో నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. జగదీశ్వరరెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో కొబ్బరి నీళ్లలో విషపదార్థం కలిపి ఇచ్చినట్లు సాదిక్ వెల్లడించినట్లు సమాచారం. కాకినాడలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పలుమార్లు విషపదార్థం ఇచ్చినట్లు విచారణలో తెలిపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన తర్వాత కూడా విషపదార్థాన్ని పంపించినట్లు, దానిని ఉపయోగించిన మరుసటి రోజే జగదీశ్వరరెడ్డి మృతి చెందినట్లు సాదిక్ వెల్లడించినట్లు సమాచారం.

జగదీశ్వరరెడ్డి భార్య సౌజన్యను వివాహం చేసుకుంటే ఆమె కుటుంబానికి చెందిన సుమారు రూ.25 కోట్ల ఆస్తి తనకు దక్కుతుందని సాదిక్ భావించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివాహానికి ఆమె తండ్రి అంగీకరించకపోవడంతో వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో బెదిరింపులకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా విషపదార్థం నమూనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, స్వాధీనం చేసుకున్న నమూనాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది.

## యానాంలో చిక్కిన 23 కేజీల భారీ పండుగప్ప..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** కాకినాడ సమీపం ఫ్రెంచ్ యానాం సముద్రంలో మత్స్యకారుల వలకు ఏకంగా 23 కేజీల భారీ పండుగప్ప చేప చిక్కింది. పండుగప్పకు ఎంతోమంది మాంసాహారం లో ప్రియం. పెద్ద పెద్ద ఫంక్షన్‌లకు, కార్యక్రమాలకి ప్రత్యేకంగా వినియోగిస్తుంటారు. దీంతో ఈ భారీ చేప స్థానికంగా ఆసక్తికరంగా మారింది. సాధారణంగా 2 నుంచి 10 కేజీల వరకు లభించే పండుగప్ప ఇంత భారీ పరిమాణంలో దొరకడం విశేషంగా మారింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వలలో భారీ చేపను గుర్తించి తొలుత ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం దానిని ఒడ్డుకు తీసుకొచ్చి వేలం నిర్వహించగా, యానాంకు చెందిన మత్స్యకార మహిళ కోలాటి దేవి రూ.15 వేల ధరకు ఈ చేపను దక్కించుకున్నట్లు సమాచారం.

పండుగప్ప చేపలు సాధారణంగా చిన్న, మధ్యస్థ పరిమాణంలోనే లభిస్తుంటాయని మత్స్యకారులు చెబుతున్నారు.

అయితే తాజాగా 23 కేజీల బరువున్న చేప వలకు చిక్కడంతో మత్స్యకారుల్లో ఆనందం నెలకొంది. అరుదుగా ఇంత భారీ పరిమాణంలో పండుగప్ప లభించడంతో చేపను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. ఉప్పునీటితో పాటు మంచినీటిలోనూ పెరిగే ఈ చేపకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

# టిటిడి చరిత్రలోనే జెఇఒ గోపీనాథ్ ప్రత్యేకం

### - తన ఇద్దరు పిల్లలు టిటిడి పాఠశాలలోనే చదువు



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా ఐఎఎస్,ఐపిఎస్ పిల్లలేగాక ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లోనో ప్రభుత్వ పాఠశాలల్లోనూ చదివించడం ఒక స్థోమతగా భావిస్తారు. అలాంటిది టిటిడి చరిత్రలోనే జెఇఒ ప్రభల గోపీనాథ్ ప్రభుత్వ అధికారులకు ఆదర్శంగా తన ఇద్దరు పిల్లలను సేవచేసే టిటిడి విద్యాసంస్థల్లోనే చేర్పించి స్ఫూర్తిదాయకంగా నిలవడం ఇప్పుడు టిటిడి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభల గోపీనాథ్ ఇటీవల ఐఎఎస్ అధికారిగా కేడర్‌లో చేరారు. ఆయన్ను గతనెల ఆగస్టు 10న టిటిడి జెఇఒగా ప్రభుత్వం నియమించింది. తన ఇద్దరు పిల్లలను తిరుపతివంటి విద్యాకేంద్రంలో ఏ కార్పొరేట్ పాఠశాలలో అయినా చేర్పించే వీలుంది. అయితే అందుకు భిన్నంగా ఆయన ఏకంగా తన ఇద్దరు కుమారులను టిటిడి ఆధ్వర్యంలోని పాఠశాలలోనే చేర్చడం ఆదర్శంగా నిలిచారు. గతంలో చదివిన ప్రైవేట్ పాఠశాలల నుండి తన ఇద్దరు కుమారులను తిరుపతిలోని టిటిడి పాఠశాలలో7, 4వ తరగతుల్లో చేర్పించారు. జెఇఒ హోదాలో ఉన్నతాధికారి నిర్ణయంపై ఉద్యోగ వర్గాల్లో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి.

## 12 ఏళ్ల బాలికకు బాల్య వివాహం ఎనిమిది మందిపై కేసు

**మొగల్తూరు, సెప్టెంబరు11, (ప్రభాతవార్త)** 12 ఏళ్ల బాలికకు 28 ఏళ్ల యువకుడితో బాల్య వివాహం జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమవరం డీసీపీయూ కార్యాలయం నుంచి అందిన సమాచారంతో మొగల్తూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి, సంబంధిత అధికారులు బాలిక స్వగ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. బాలికకు బాల్య వివాహం జరిగినట్లు నిర్ధారించిన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బాల్య వివాహానికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరిపై సెక్టార్ సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట - రూ.6 కోట్లతో 117 అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, సెప్టెంబరు11, (ప్రభాతవార్త) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మండలంలోని తేతలి, ముద్దాపురం, కోనాల, దువ్వ, మండపాక, కొమరవరం, మహాలక్ష్మి చెరువు, వేల్పూరు గ్రామాల్లో రూ.6.00 కోట్ల విలువైన 117 అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్ల నిర్మాణంతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సమన్వయంతో, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# తిరుమల సమాచారం

## కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వర ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు లోక కల్యాణం భక్తుల శ్రేయస్సు కోసం ఆలయంలోని కామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం నిర్వహించి రెండు విడతలుగా లక్ష కుంకుమార్చన పూర్తి చేశారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో లక్ష కుంకుమార్చన టిటిడి వైభవంగా నిర్వహిస్తుంది. సాయంత్రం కపిలేశ్వర స్వామి, కామాక్షి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. గృహస్థ భక్తులకు

## పుష్కరిణి హారతి పునరుద్ధరణ



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో దేవదేవుని ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్రపుష్కరిణి మరమ్మతులు, శుద్ధి పనులు పూర్తవ్వడంతో శుక్రవారం పుష్కరిణిని పున:ప్రారంభించారు. దాదాపు 40రోజులపాటు పుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం మూసివేసి మరమ్మతులు, పైప్‌లైనుల ఏర్పాటు, పవిత్రమైన నీటిని విడుదల చేసింది. ఆ తరువాత మళ్ళీ ఈనెల 10రోజుల వరకు భక్తులను అనుమతించలేదు. శుక్రవారం ఉదయం పుష్కరిణిలోనికి భక్తులను అనుమతించారు. పుష్కరిణి చుట్టూ బలమైన స్టీల్ పైపులు ఏర్పాటుచేశారు. పుష్కరిణిలో నీటిని ప్రతిరోజూ నిరంతరాయంగా శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంది. నిరంతరాయంగా కొంత శాతం నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు.

## శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండల వేంకటేశ్వరస్వామి తొలిసాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబవుతోంది. ఇప్పటికే 90శాతం ఏర్పాట్లు, పనులు పూర్తయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా తొమ్మిదిరోజులు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా 14వతేదీ సోమవారం రాత్రి అంకురార్పణతో శ్రీకారం చుట్టనున్నారు. 15వతేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు మొదలవుతాయి. తొలిరోజురాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహన సేవతో మొదలై చివరగా సెప్టెంబర్ 23వతేదీ ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాలకు భారీగా భక్తులు తిరుమలకు తరలిరానున్నారు. భక్తుల రద్దీకి తగ్గట్లు టిటిడి అధికారులు ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆలయ అధికారులు ,విజిలెన్స్,ఇంజనీరింగ్ విభాగం అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. ఆలయ మాఢవీధుల్లో ఉండే భక్తులకు గ్యాలరీలు, తాగునీరు, అన్నప్రసాదాలు, మజ్జిగ,వైద్యసేవలు అన్నీ అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లుచేశారు. సోమవారం సాయంత్రం శ్రీవారి సేనాధిపతి విశ్వక్సేనులు ఆలయానికి నైరుతుమూలలో వున్న వసంతమండపానికి ఛత్రఛామర మంగళవాయిద్యాలతో వెళతారు. అక్కడ పుణ్యాహవచనం, భూమిపూజ తదితరాలు నిర్వహించి పుట్టమనున్న సేకరించి మృత్సంగ్రహణంచేస్తారు. ప్రదక్షిణగా ఆలయంలోనికి చేరుకుంటారు. నవధాన్యాలతో అంకురార్పణం జరుగుతుంది. వైఖానస ఆగమశాస్త్రంగా గరుడకేతన ప్రతిష్ట, కంకణధారణ, శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్పస్వామి సమక్షంలో ఆలయ అర్చకులు, జీయ్యంగార్లు,వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా బంగారు ధ్వజస్తంభంపై మంగళవారం సాయంత్రం గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. తదనంతరం సిఎం చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు తీసుకువచ్చి సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు మంగళవారంరాత్రి తొలివాహనంగా ఏడుతలల శేషునిపై ఉభయనాంచారులతో కలసి విహరిస్తారు. స్వామిని నిత్యం కొలిచి సేవించే వారిలో శేషుడు ఒకడు. స్వామికి క్షీరసాగరంలో ,పరమపదంలో శయనమందిరంగా ,పడకగా, ఆసనంగా ,పాదుకలుగా, వస్త్రంగా ,గొడుగుగా ఆయా అవసరాలకు తగినట్లు రూపాంతరం చెంది కైంకర్యం చేసే మూర్తి. విశేష జ్ఞాన బలముకలిగినవాడు. ఈ శేషవాహనం దాస్యభక్తికి నిదర్శనం, ఏడుకొండలవాడికి అత్యంత పవిత్రమైన పెరటాసి మాసం కూడా సాలకట్లబ్రహ్మోత్సవాలు జరిగే సెప్టెంబర్‌నెలలోనే రావడంతో తమిళభక్తులతోబాటు తెలుగురాష్ట్రాలు, కర్నాటక, ఉత్తరభారతదేశం నుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 18వతేదీ పెరటాసి మాసం ఆరంభమైతే 19వతేదీ తొలి శనివారం, 26వతేదీ రెండవ శనివారం, అక్టోబర్ 3వతేదీ మూడవవారం, 10వతేదీ నాల్గవవారం,అక్టోబర్ 17వతేదీతో శనివారాలు ముగుస్తాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కల్పించాల్సిన సౌకర్యాలు, క్యూలైన్లు నిర్వహణ, మాఢవీధుల్లో జర్మనీ షెడ్లు తదితర వాటిపై దృష్టి పెట్టారు.

## స్వామికి నివేదించే అన్నప్రసాదాల నైవేద్యం



**తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ వివిధ రకాల అన్నప్రసాదాలు, పిండి వంటలు, ఇతర రుచికరమైన పదార్థాలను శాస్త్రోక్తంగా నైవేద్యంగా సమర్పిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో జరిగే నైవేద్య కైంకర్యాల్లో ఆయా సమయాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ప్రసాదాలను స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో నైవేద్యాలకు ప్రత్యేకమైన వైఖానస ఆగమ సంప్రదాయాలు ఉన్నాయి. ఆలయ పోటులో నైవేద్య పదార్థాలను అత్యంత పవిత్రతతో, సాంప్రదాయ పద్ధతులకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. నైవేద్య తయారీలో ఉపయోగించే పదార్థాలు, పాత్రలు, తయారీ విధానాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. శ్రీవారి నైవేద్యంలో ఎండుమిర్చి, పచ్చిమిర్చిని ఉపయోగించకుండా నల్లమిరియాలను వినియోగించడం ప్రాచీన సంప్రదాయంగా కొనసాగుతోంది. భక్తులు పులిహోరగా పిలుచుకునే ప్రసాదాన్ని "తింత్రిణీరసాన్నం", నెయ్యి పొంగలిని ముద్గాన్నం", బెల్లం అన్నాన్ని "గుడాన్నం", మిరియాల అన్నాన్ని మరీచ్యాన్నం, వడను "మాషాపూపం, దోశను "చక్రప్పం అని పిలుస్తారు. నైవేద్య ప్రియుడైన శ్రీవారికి అనునిత్యం 45 రకాల ప్రసాదాలను నివేదిస్తారు. వీటిలో 20రకాల అన్న ప్రసాద నైవేద్యములు కాగా మిగిలినవి పణ్యారములు కావడం విశేషం. ఉదయం నైవేద్యం ఆలయంలో మొదటి గంట అనంతరం స్వామివారికి ఉదయం నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో మాత్రాన్నం, ముద్గాన్నం (నెయ్యి పొంగలి), తింత్రిణీరసాన్నం (పులిహోర), దధ్యోదనం (పెరుగన్నం), గుడాన్నం (బెల్లం అన్నం/చక్ర పొంగలి), శాకాన్నం (కదంబం అన్నం), శర్కరాన్నం (రవ్వకేసరి) వంటి ప్రసాదాలను సమర్పిస్తారు. వీటితో పాటు ప్రతిరోజూ నాలుగు రకాల పణ్యారములు , పిండి వంటలను కూడా నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిలో లడుకం (లడ్డు), మాషాప్పం (వడ), గుడప్పం (అప్పం), చక్రప్పం (దోశ) ఉన్నాయి. రెండో గంట అనంతరం స్వామివారికి మధ్యాహ్న నైవేద్యం ,రాజభోగాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో శుద్ధాన్నం (తెల్ల అన్నం), పులిహోర, గుడాన్నం, దధ్యోదనం, శీరా లేదా శక్కరభాత్ వంటి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. మూడో గంట అనంతరం రాత్రి నైవేద్యంగా శయనభోగాన్ని నిర్వహిస్తారు. ఈ సమయంలో మరీచ్యాన్నం (మిరియాల అన్నం), చక్రప్పం (దోశ), లడుకం (లడ్డు), మాషాప్పం (వడ), శర్కరాన్నం తదితర ప్రసాదాలను స్వామివారికి సమర్పిస్తారు. సాయంకాల ఆరాధన సమయంలో గర్భాలయాన్ని మరోసారి శుభ్రపరిచి, శ్రీవారిని తాజా పుష్పాలతో అలంకరిస్తారు. సాయంకాల కైంకర్యాల అనంతరం నిర్వహించే శయనభోగంలో భాగంగా అర్ధరాత్రి సమయంలో స్వామివారికి "తిరువీసం" అనే ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పిస్తారు.

తిరువీసంలో తెల్ల అన్నంతో పాటు బెల్లంతో తయారు చేసిన తీపి రుచిగల గుడాన్నం ఉంటుంది. రోజులో చివరిగా నిర్వహించే ఏకాంత సేవలో స్వామివారికి వెచ్చని పాలు, కాలానుగుణంగా లభించే ముక్కలుగా కోసిన పండ్లు, నెయ్యిలో వేయించిన ఎండు పండ్లు సమర్పిస్తారు. ప్రతి నైవేద్యానికి ప్రత్యేకమైన పేరు, తయారీ విధానం, సమర్పించే సమయం ఉండటం తిరుమల ఆలయ వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. భక్తులు ప్రసాదంగా స్వీకరించే పులిహోర, పొంగలి, వడ, అప్పం తదితర పదార్థాల వెనుక ఇమిడి ఉన్న ఈ ప్రాచీన వైఖానస ఆగమ సంప్రదాయాలు శ్రీవారి నైవేద్యాల ప్రత్యేకతను మరింతగా తెలియజేస్తున్నాయి.

12-09pg10exHMNWJQEBPRCKLT.qxdo/p:12-09pg10exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 9:05 AM Page 1






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.